క్లుప్తంగా

వాలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కడపలోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల ఇరవై వేల మంది వలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే వారికి రావాల్సిన నాలుగు నెలల గౌరవ వేతన బకాయిలు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రెగ్యులర్ ఆర్‌జేడీని నియమించాలి

కడప ఎడ్యుకేషన్ : బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ రాయలసీమ ప్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారిని నియమించాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. కడపలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లకు పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా ఉంటున్న రవి ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను శాసిస్తున్నారన్నారు. ప్రిన్సిపల్‌గా ఉంటూ ఇన్‌ఛార్జి డీవీఆర్‌ఓ, ఆర్ఐఓ, ఆర్‌జేడీ పదవుల్లో కొనసాగారన్నారు. గతంలో ఆయనపై వచ్చిన అక్రమాల ఆరోపణలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు నరేంద్ర, అయ్యన్న, గోపి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని రవీంద్ర నగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడి నాలుగు తులాల బంగారు, అర కిలో వెండి ఆభరణాలను అపహరించుకు వెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 8న శ్రీనివాసులు తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి గురువారం కడపకు చేరుకుని చూసేసరికి ఇంట్లో బీరువాలో బంగారు నగలు, వెండి వస్తువులు దొంగలు అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు తెలియజేశారు.

ప్రత్యామ్నాయాన్ని అందిస్తాం

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రజలకు రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తామని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ.సుందరరామరాజు అన్నారు. కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ప్రొద్దుటూరుకు చెందిన ఒంటెద్దు ప్రదీప్‌రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. ప్రదీప్‌రెడ్డి జాలా జయవర్ధన్, బీరం సుభాష్‌చంద్రారెడ్డి, కోటపాటి సుబ్బమ్మ, హిమబిందు, డాక్టర్ జీవీ.సుబ్బయ్య, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : హిమ వర్షిణి ఫౌండేషన్ ప్రతినిధులు నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, రవి పాల్గొన్నారు.

పట్టు పట్టి.. పతకం ఒడిసిపట్టి

కడప నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు రెజ్లింగ్ క్రీడలో రాణిస్తూ పతకాల పంట పండిస్తున్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పలువురు క్రీడాకారులు పతకాలు సాధించగా, మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు చెందిన నలుగురు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

- రెజ్లింగ్‌లో రాణిస్తున్న నగర క్రీడాకారులు
- నలుగురు క్రీడాకారులకు బంగారు పతకాలు
- జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక

కడప స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపడంతో చక్కటి ఫలితాలు దక్కాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు విజయవాడ సమీపంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లోని వివిధ కేటగిరీల్లో 24 పతకాలు జిల్లాకు రావడం విశేషం. ఇందులో కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్ పాఠశాల నుంచే 9 మంది క్రీడాకారులు పాల్గొని 12 పతకాలు సాధించారు. ఇదే పాఠశాలకు చెందిన నలుగురు క్రీడాకారులు అండర్-14, అండర్-17 విభాగాల్లో విజేతలుగా నిలిచి బంగారు పతకాలు దక్కించుకున్నారు. వీరు నవంబరు 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గోరఖ్‌పూర్‌లో జరిగే అండర్-14, డిసెంబరులో ఢిల్లీలో జరిగే అండర్-17 గ్రీకో విభాగం పోటీలకు ఎంపికైన ఏపీ జట్టులో స్థానం సంపాదించారు. ఆ క్రీడాకారులను సాక్షి పలుకరిస్తే ఇలా చెప్పారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో ఫిజికల్ డైరెక్టర్ ఎల్. వెంకటలక్ష్మి

రోజూ సాధన చేస్తాం



కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పదో తరగతి చదువుతున్నాను. సాయంత్రం స్కూల్ అయిపోయిన వెంటనే సాధన ప్రారంభిస్తున్నాం. మా పాఠశాల పీడీ వెంకటలక్ష్మి ప్రోత్సాహంతోపాటు సీనియర్ క్రీడాకారులు వంశీ, అశోక్, నికిత, రాజేష్ మాకు ఆటలో మెలుకువలు నేర్పుతున్నారు. అమ్మ బ్రహ్మలక్ష్మి గృహిణి, నాన్న కేశవ శానిటేషన్ పనిచేస్తారు. మా అమ్మా, నాన్నను ఒప్పించి ఈ క్రీడలో రాణించేలా పీడీ మేడం కృషి చేశారు. వారి ఆశలను నెరవేర్చేలా అండర్-17 గ్రీకో విభాగంలో గోల్డ్ మెడల్ సాధించా. జాతీయ స్థాయిలో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

\- ఎస్. చెన్నకేశవ, రెజ్లింగ్ క్రీడాకారుడు, కడప

ఈ ఏడాది పట్టు తప్పలేదు..



గతేడాది అండర్-14 విభాగంలో పోటీపడి తృటిటో బంగారు పతకం మిస్సయ్యాను. ఈ యేడాది మరింత కసితో సాధన చేసి అండర్-14 విభాగంలో 41 కిలోల వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీలో బంగారు పతకం సాధించాను. దీంతో గోరఖ్‌పూర్‌లో నవంబరులో నిర్వహించే నేషనల్స్‌కు ఎంపిక చేశారు. దీంతోపాటు తైక్వాండోలో కూడా పతకం సాధించాను. అమ్మానాన్నలు నరసింహులు, ఉషారాణిలు కూలిపని చేసుకుంటూ మమల్ని చదివిస్తున్నారు. నేను హాస్టల్‌లో ఉంటూ చదువుతూనే క్రీడల్లో రాణిస్తున్నా.

\- ఎస్. పవన్, రెజ్లింగ్ క్రీడాకారుడు, కడప

క్రీడల కోసం కడపకు వచ్చాను..



మా ఊరు బద్వేలు.. కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో క్రీడలు బాగా నేర్పుతారని తెలిసి ఇక్కడ ఎస్సీ హాస్టల్‌లో చేరి పాఠశాలకు వస్తున్నాను. మా వార్డెన్ వెంకటరమణ ప్రోత్సహించడంతో రెజ్లింగ్‌లో సాధన ప్రారంభించాను. గతేడాది సైతం ఎస్‌జీఎఫ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించడంతో పాటు ఢిల్లీలో జరిగిన నేషనల్స్‌లో పాల్గొన్నాను. తాజాగా అండర్-17 విభాగంలో 80 కిలోల వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం సంతోషంగా ఉంది.

\- జి. వినయ్, రెజ్లింగ్ క్రీడాకారుడు, కడప

తొలి ఏడాదే పతకం సాధించా..



రెజ్లింగ్ క్రీడ సాధన ప్రారంభించిన సంవత్సరంలోనే స్వర్ణ పతకం సాధించడం సంతోషంగా ఉంది. అమ్మ సోనీ, నాన్న షామ గుప్తా పెయింటింగ్ పనిచేస్తారు. ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకోవాలనుకున్న నాకు మా పీడీ మేడం వెంకటలక్ష్మి రెజ్లింగ్ ఎంపిక చేసుకోమని సూచించడంతో సాధన ప్రారంభించాను. తొలిసారే అండర్-14 విభాగంలో 75 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను.

\- దీపక్ గుప్తా, రెజ్లింగ్ క్రీడాకారుడు, కడప

వైవీయూ అధ్యాపకుడి పరిశోధన పత్రం

వైవీయూ : యూకేలోని ప్రతిష్టాత్మక కోపసిడెక్స్ జర్నల్ 'కెమ్కామ్'లో ప్రచురితమైన పరిశోధన పత్రాలలో వైవీయూ ఆచార్యులు ఎంవీ.శంకర్ రాసిన పరిశోధన పత్రానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. కెమ్ కాం హిస్టారిక్ పేపర్స్ ఇండియాలో భాగంగా 'నానో సైజ్ ఎఫెక్ట్స్ ఆన్ సీయూఓ/టీఐఓ2 కటాలిస్ట్ ఫార్ హైలీ ఎఫిషియంట్ హెచ్-2 ప్రొడక్షన్ అండర్ సోలార్ లైట్ ఇరడేషన్' అంశంపై ఈయన పేపర్ ప్రజెంటేషన్ చేశారు. కెమ్కామ్ జర్నల్ వార్షికోత్సవం సందర్భంగా భారతదేశం నుంచి పరిశోధన పత్రాలను ఎంపికచేయగా అందులో యోగి వేమన యూనివర్సిటీ, హైదరాబాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) సహకారంతో ప్రచురితమైన శంకర్ పత్రానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీసింగ్, ఫొటో, వీడియోగ్రఫీలలో 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల యువకులకు ఈ నెల 14వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరాడాలి

కడప సెవెన్‌రోడ్స్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను చట్ట సవరణ పేరుతో హరిస్తున్నారని, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ దళితమిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. 'భారత రాజ్యాంగం-బలహీన వర్గాల అభ్యున్నతి' అంశంపై ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం వల్ల అనేక హక్కులు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లభించాయన్నారు. జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ దళిత, బలహీన వర్గాలకు పొందుపరిచిన హక్కుల కారణంగా ఆయా వర్గాలు జీవన స్రవంతిలోకి రాగలిగాయన్నారు. బందెల రామాంజనేయులు, కైపు బాబు, డీఎం ఓబులేశు, సీనియర్ నాయకులు వైఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న ఏపీ దళిత మిత్ర సంఘం నాయకులు

నూతన కార్యవర్గం : ఏపీ దళిత మిత్ర సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా బందెల ఓబయ్య, ఉపాధ్యక్షుడిగా కైపు బాబు, అధికార ప్రతినిధిగా పెడబల్లి నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కె.శివయ్య, కార్యవర్గ సభ్యులుగా వెంకట రమణ, ఓబులేశు, ఏసోబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరీక్షల నియంత్రణాధికారి నియామకం

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల పరీక్షల నియంత్రణాధికారిగా డాక్టర్ పెనుగొండ రామకృష్ణను నియమిస్తూ ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్ ఉత్తర్వులు జారీచేశారు. 2026 అక్టోబర్, 10వ తేదీ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. గత కొద్దినెలలుగా కళాశాలలో పరీక్షల నియంత్రణాధికారి పోస్టు కోసం పలువురు పోటీ పడ్డారు. డా.పి.రామకృష్ణ తాను ఆ పదవికి అర్హుడనంటూ దరఖాస్తు చేయగా, అధికారులు మరొకరిని నియమించారు. దీంతో ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్టీ కమిషన్‌ను ఆయన ఆశ్రయించారు. ఏపీ ఉన్నతవిద్య ప్రిన్సిపల్ సెక్రటరీకి నోటీసులు రావడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రామకృష్ణను సీఈగా నియమించడం, లిఖితపూర్వకంగా ఫిర్యాదు వెనక్కు తీసుకోవడంతో కథ సుఖాంతమైంది.

రతన్ టాటా మృతి దేశానికి తీరనిలోటు

కడప ఎడ్యుకేషన్: భారతదేశ వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. కడప ఆర్ఎస్‌యూ కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి గురువారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక, సేవా రంగాలకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, కొండేటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

కడప అర్బన్ : మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. కడప నగర శివారులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో జరిగిన ×ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం×లో జడ్జి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై చూపించే ప్రభావాలను ప్రజల దృష్టికి తీసుకురావడానికి వేలాదిమంది స్వచ్ఛంద కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. 2024 నినాదం్బపనిలో మానసిక ఆరోగ్యం , మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు, ఆరోగ్యానికి మించిన ఆస్తిలేదు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, మొదలు అంశాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంహెచ్ డాక్టర్లు వంశీకృష్ణ, సురేష్, సాహిద్ బాషా, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ మానసిక వైద్యశాలలో జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్

వృద్ధాశ్రమం తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని బృంద, చౌడమ్మ వృద్ధాశ్రమాలు, మా అమ్మ ఒడి, శక్తి సదన్‌లను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబాఫక్రుద్దీన్ గురువారం తనిఖీ చేశారు. వంటశాలలు, వసతి గదులు, డైనింగ్ హాళ్లు, స్టోర్ గదులు, పరిసరాలు పరిశీలించారు.

జయ జయహే.. మహిషాసుర మర్దిని..

కడప కల్చరల్ : సర్వ దుష్ట కార్యాలనూ తునియలు చేసే ముగ్గురమ్మల శక్తి ఆది పరాశక్తి. మహిషాసురుడిని ఒక్క వేటుతో తునుమాడిన రోజు దుర్గాష్టమి. గురువారం దుర్గాష్టమి కావడంతో ఆలయాల్లో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ సమీప దారులన్నీ జనసంద్రాలయ్యాయి. కడప రాయడు దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చగా, మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కరుణించారు. కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా, విజయదుర్గాదేవి మాతను మహాగౌరీదేవిగా అలంకరించారు. గడ్డి బజారు సత్యనారాయణస్వామి స్వామిని లక్ష్మీనారాయణుడిగా, కామకోటి కళాంబదేవిని ధాన్యలక్ష్మిగా అలంకరించారు. బాల పోలేరమ్మ, నడివీధి గంగమ్మలను సంతాన లక్ష్మిగా అలంకరించారు. లలితాంబిక ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా కొలువుదీర్చారు.


లక్ష్మీనారాయణుడిగా సత్యదేవుడు


ధాన్యలక్ష్మిగా కామకోటి కళాంబదేవి


తిరుచ్చి వాహనంలో ఉభయ దేవేరులతో కడప


లలితాకాంబిక ఆలయంలో దుర్గాదేవి అలంకారం


మహిషాసురమర్దినిగా వాసవీ కన్యకాంబ


సంతానలక్ష్మిగా నడివీధి గంగమ్మ


విజయదుర్గాదేవి ఆలయంలో చిన్నారుల కోలాటం


విజయదుర్గాదేవి ఆలయంలో భక్తుల సందడి